ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
బుధవారం | 08 ఏప్రిల్ , 2026 | పేజీలు : 06

## వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మునిస్పల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలాజీ గ్రాండ్ బ్యాంకెట్ హాల్‌లో మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి రాకుండా అర్‌డబ్లుఎస్, పబ్లిక్ హెల్త్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న విలీన గ్రామాలలోని వార్డులలో ముందస్తుగా గుర్తించి ప్రణాళిక బద్ధంగా మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తొవ్విన గోతులను వెంటనే పూడ్చి, రోడ్లను యథాస్థితికి తీసుకురావాలన్నారు. పనులపై ఎప్పటికప్పుడు మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ సిహెచ్. హన్మంత రెడ్డి, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికే మోడల్ కాలనీ
# తలమానికం



రూ.10 కోట్లతో మోడల్ పబ్లిక్ స్కూల్

ఏప్రిల్ చివరిలో మోడల్ కాలనీ ప్రారంభోత్సవం

మొదటి విడతలో 1500 మందికి ఇండ్ల పంపిణీ

పారదర్శకంగా లబ్దిదారులకు ఇండ్ల పంపిణీ

ఫైరవీలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆస్కారం ఉండదు

ప్రజాప్రతినిధులు సిఫార్స్ చేసిన వారు అర్హులై ఉండాలి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఫణిగిరి రామస్వామి గుట్ట సమీపంలో 116 ఎకరాల విస్తీర్ణంలో 2160 సింగిల్ బెడ్ రూమ్‌లతో నిర్మించిన మోడల్ కాలనీ తెలంగాణ రాష్ట్రానికే తలమానికం కానుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మోడల్ కాలనీని మంత్రి సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిన మోడల్ కాలనీ కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ నుండి అప్పటి మార్కెట్ రేట్ ప్రకారం ధర చెల్లించి భూమి కొనుగోలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం, తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం మోడల్ కాలనీ పనులను ఉద్దేశ్యపూర్వకంగా ఆటకెక్కించడంతోటి ఇంతటి జాప్యం కలిగిందన్నారు. అప్పటికే 90శాతం మేర పనులు పూర్తి అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందన కోణంలో నాటి పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రావడంతో పనులు వేగవంతం చేశామన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మోడల్ కాలనీని తీర్చిదిద్దుతామని అందులో బాగంగానే భూమి కొనుగోలుకు చేసిన వ్యయం మినహాయించి మొత్తంగా ఒక్క నిర్మాణానికే 125 కోట్లు వెచ్చించడంతో పాటు మరో 20 కోట్లు తాజాగా మంజూరు చేయించినట్లు ఆయన వెల్లడించారు. పదికోట్లతో మోడల్ కాలనీలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు, మరో పది కోట్లతో ఇదే కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటి హాల్, క్రీడాప్రాంగణం, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాట్లతో పాటు సిసిరోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ మాసంలో మోడల్ కాలనీ ప్రారంభోత్సవం ఉంటుందని, ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. ప్రారంభోత్సవానికి ముందే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని అందులో మొదటి విడతలో అధికారులు 1500 మంది లబ్ధిదారుల ఎంపిక చేస్తారని ఆయన ప్రకటించారు. అయితే అదే సమయంలో లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా పూర్తిస్థాయిలో పారదర్శకంగా ఉంటుందని బహిరంగంగా మంత్రి ప్రకటించారు. హుజూర్‌నగర్‌కే ఐకాన్‌గా నిలబడనున్న ఈ మోడల్ కాలనీ లబ్ధిదారుల ఎంపికలో అపోహలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని నిష్పక్షపాతంగా ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన సిఫార్సులు కూడా అర్హులైన వారే ఉండాలని ఆయన సూచించారు. అనర్హులను సిఫార్స్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారుల జాబితాను ఒకటికి రెండుసార్లు నిశితంగా పరిశీలించాలని జాబితాలో ఒక్క అనర్హుడి పేరు ఉన్న మోడల్ కాలనీ నిర్మాణ సంకల్పం దెబ్బ తింటుందని ఆయన అధికారులకు నిర్దిష్టమైన అదేశాలు జారీ చేశారు. నిజనిజాలు తెలుసుకోకుండా ప్రజల్లో గందరగోళం సృష్టించి అపోహలు రేకితిస్తే కఠిన తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అధికారుల ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా ఉంటుందని అన్నారు. ఒకవేళ ఎవరికైనా అనుమానం వస్తే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, ఆర్డీవో శ్రీనివాసులు, గృహనిర్మాణ శాఖ అధికారులు, తహసిల్దార్ బండ కవిత, సిఐ చరమందరాజు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూమి అమాయకుల పేర్లపై నమోదు

మధ్యవర్తుల మోసానికి గురైన తుర్కగూడెం గ్రామస్తులు



**ప్రజాపక్షం/మునుగోడు:** అమాయక ప్రజలను ఆసరాగా చేసుకుని మధ్యవర్తులు, అప్పటి అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ భూమిని గ్రామపంచాయతీ రికార్డుల్లో వారి పేర్లపై నమోదు చేసి మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.మండల కేంద్రంలోని మునుగోడు గ్రామపంచాయతీ పరిధిలోని తుర్కగూడెంలో సుమారు 36 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరిలో కొంతమంది అమాయకులను లక్ష్యంగా చేసుకున్న మధ్యవర్తులు,గూడెం సమీపంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 78లో గజాల వారీగా ప్లాట్లు కేటాయించినట్లు చూపించి, ఒక్కొక్కరికి 200 నుంచి 400 గజాల వరకు గ్రామపంచాయతీ రికార్డుల్లో నమోదు చేసినట్లు ధృవీకరణ పత్రాలు ఇచ్చారు.ఈప్రక్రియ సుమారు ఏడు సంవత్సరాల క్రితం అధికారుల సహకారంతో జరిగినట్లు సమాచారం.అలాగే కొంత మంది గ్రామస్థులు ఈధృవీకరణ పత్రాల ఆధారంగా చండూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారు.తాజాగా మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం అదే సర్వే నంబర్ 78లో 20 ఎకరాలు 9 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారు. స్కూల్ నిర్మాణం కోసం కొంతమంది రైతుల 7 ఎకరాల భూమిని అధికారులు స్వాధీనం చేసుకోగా,ప్రత్యామ్నాయంగా భూమి కేటాయింపు సమయంలో తుర్కగూడెం గ్రామస్తులు తమకు గ్రామపంచాయతీ రికార్డుల్లో నమోదు ఉన్న భూమి ఇదేనని పేర్కొంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు.ఈనేపథ్యంలో చండూరు ఆర్‌డిఓ,మునుగోడు తహసీల్దార్ ధృవీకరణ పత్రాలను పరిశీలించి,ప్రభుత్వ భూమిని గ్రామపంచాయతీ రికార్డుల్లో తప్పుగా నమోదు చేసినట్లు తేల్చారు.అలాంటి ధృవీకరణ పత్రాలకు చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు.దీంతో మధ్యవర్తుల మాటలు నమ్మి ఒక్కో ప్లాట్‌కు రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చు పెట్టినట్లు బాధితులు వాపోతున్నారు.మధ్యవర్తుల మోసంతో తాము పూర్తిగా నష్టపోయామని,తమకు న్యాయం చేయాలని వారు అధికారులను కోరుతున్నారు.

## వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిపై ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం



వివరాలు మెయిన్‌లో



## బాలమృతం సద్వినియోగం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** అంగన్‌వాడీ కేంద్రాలను బాలింతలు, గర్భిణీలు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని 2వ వార్డు కౌన్సిలర్ యారవ లక్ష్మి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నేరేడుచర్ల పట్టణంలోని అంగన్‌వాడీ2వ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలింతలు, గర్భిణీలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోని ఆరోగ్యంగా ఉండాలని, పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న బాలమృతంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్ ఉపేంద్ర, కమిటి సభ్యులు చంద్రిక, ఆశ గురవమ్మ, దైవకమ్మ, వైష్ణవి, సునిత, నిరీక్షణ, సంధ్య, ఆయా నాగమణి, పాల్గొన్నారు.

## 11న ఉచిత మెగా వైద్య శిబిరం

**ప్రజాపక్షం/నడిగూడెం:** ఈనెల 11న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నడిగూడెం సర్పంచ్ దున్నా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోదాడ స్వర్ణభారతి చారిట్రబుల్ టస్టు, హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోధ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించే వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం పది గంటలకు గ్రామ పంచాయతీ ఆవరణలో వైద్యులు ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, ఈసిజి, టుడిఈకో, బిపి, షుగర్, ఎముకల టస్టులు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## బడిబాట కార్యక్రమం



**ప్రజాపక్షం/మునగాల:** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను అందిస్తున్నామని మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలోని శ్రీనివాసనగర్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ బిక్షం, సిఆర్‌పి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆశాల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడితే పోలీసులు లాఠీచార్జి చేసి నాయకులపై అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. ఈ సమావేశంలో గరిడేపల్లి సిఐటియు మండల కన్వీనర్ యాకుబ్, తులసి, యశోధ, మంజుల, స్వర్ణ, విజయరాణి, సునీత, మాధవి పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని వైద్యాధికారి వేణుగోపాల్‌నాయక్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి ఆరోగ్య సిబ్బందితో గ్రామంలో ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ శుభ్రమైన పరిసరాలు, సమతుల్య ఆహారం, వ్యాయమం, మానసిక ఆరోగ్యం, తల్లి శిశు ఆరోగ్యం, అంటు వ్యాధుల నివారణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పద్మ, సూపర్‌వైజర్ సిహెచ్ పద్మ, నర్సింగ్ ఆఫీసర్లు రత్నమేరి, ఇందిరాల రామకృష్ణ, టిబి ట్రిట్మెంట్ సూపర్‌వైజర్ మమత, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/చండూరు:** సీఎం సహాయ నిధి పథకాన్ని అర్హత ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పుల్లెంల సర్పంచ్ ముక్కాంల వెంకన్న యాదవ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన 60వేల రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. బొడ్డు సత్తయ్యకు 24వేలు, బొడ్డు వెంకన్న 15వేలు ,లోక జయశ్రీ 60వేలు , నీలకంఠం మారయ్యకు 27వేలు , ముక్కాంల రాజు 24వేలు , పాలకూరి సైదులుకు 15వేలు ఎర్ర యాదగిరికి 60వేలు రూపాలయలతో మొత్తం 2లక్షల 25వేల రూ.ల విలువ కలిగిన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిహెచ్ ఊషయ్య, మాజీ ఎంపిటిసి వడ్డగోని రాఘవేందర్ ,కాంగ్రెస్ మండల నాయకులు మందడి శంకర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు వడ్డగోని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో నూతనలైట్లు ఏర్పాటు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని మూడో వార్డులో ఎన్‌జివోస్ కాలనీలో 25వ వార్డు సీతారాంనగర్‌ల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఆయా వార్డుల కౌన్సిలర్లు సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్; కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్‌రెడ్డి లు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ మున్సిపల్ పరిధిలో 3వ, 25వ వార్డులలో నూతన వీధిలైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల కౌన్సిలర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ సహకారంతో తమ వార్డుల అభివృద్ధే ధ్యేయంగా ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయలకల్పనకై కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యల్లావుల వీరయ్య, ఒర్సు వెంకన్న, తోట ఉపేందర్, పిల్లి శివశంకర్, దగ్గుపాటి రమేష్, మామిడి కాశయ్య, పగిలి నాగేంద్రబాబు, గౌతం పాల్గొన్నారు.



# ఫీజులు వసూలు చేయాలని హైకోర్టు చెప్పడం బాధాకరం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్రంలో పేద విద్యార్థులందరు ప్రభుత్వం ఇచ్చే ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుకుంటున్న నేపథ్యంలో హైకోర్టు పేద విద్యార్థుల ఫీజులు నేరుగా వారే చెల్లించుకోవాలని తీర్పు ఇవ్వడం బాధాకరమని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని కళాశాలలో మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు ప్రభుత్వ అందించే ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి విద్యను అభ్యసిస్తున్న సందర్భంలో ప్రభుత్వం విద్యార్థులకు రూ.6500 కోట్ల బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని అన్నారు. కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వం నుంచి అందే ఫీజు బకాయిలు అందకపోవడంతో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను రాత్రికి రాత్రే తీసుకొచ్చారని కనీసం అగ్రవర్ణాల్లో ఎంత మంది పేదలు ఉన్నారో లెక్కలు చేయకుండా రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జక్క నాగేశ్వర్‌రావు, ఎర్రబెల్లి గంగాధర్, పట్టేటి రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆహార నియమాలు పాటించాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రతి రోజు క్రమం తప్పకుండా వ్యాయామం, సమతుల్యమైన ఆహార నియమాలను పాటించాలని వైద్యాధికారి డాక్టర్ నగేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన ఆహారము తీసుకోకపోతే సరైన నిద్ర, మానసిక ఒత్తిడితో అనారోగ్యాల బారినపడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ బిచ్చు నాయక్, హెల్త్ సూపర్‌వైజర్ లలిత ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





## మిషన్ వాత్సల్య పథకం, బాలల చట్టాలపై అవగాహన

**ప్రజాపక్షం/మునగాల:** ప్రతి ఒక్కరు మిషన్ వాత్సల్య పథకం, బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిడిపివో పారిజాతం, బాలల పరిరక్షణ అధికారి విద్యాసాగర్ లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలో ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల పరిరక్షణ, మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు అమ్మాయిలకు, 21 సంవత్సరాలలోపు అబ్బాయిలకు బాల్య వివాహం చేసిన వారి తల్లిదండ్రులు శిక్షకు అర్హులవుతారని, చిన్నతనంలోనే పెళ్లి కావడం వల్ల పిల్లలు శారీరకంగా మానసికంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారని, చదువుకు దూరమై బాలల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు సునీత, సుధా, షబాన, హమీదా, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డు మెంబర్లు, ఆశా వర్కర్లు, పొదుపు సంఘాల లీడర్లు, తల్లులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కళ కాంగ్రెస్‌తోనే



**ప్రజాపక్షం/చివ్వెంల :** పేదల సొంతింటి కళ కాంగ్రెస్‌తోనే సాకారమవుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గాయం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బండమీది చందుపట్ల గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇళ్లను ఆయన సందర్శించి మాట్లాడారు. గత పాలకులు 10 సంవత్సరాల్లో ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికి ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నర్సరీల్లో షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వేసవిలో ఎండలు తీవ్రమైనందున నర్సరీల్లో షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని, వంద శాతం జెర్మినేషన్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రుద్రారం, లక్ష్మీ పురం, కొత్తగూడెం గ్రామాల్లో నర్సరీలను ఆయన పరిశీలించారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులను, ఫీల్డ్ అసిస్టెంట్లను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఉపాధి హామీ పనులను గ్రామాల్లో చేయడానికి చాటింపు చేసి ప్రతి గ్రామానికి వంద మంది కంటే ఎక్కువ మంది పనులకు వచ్చేలా చూసి వారితో పనులు చేయించాలన్నారు. గ్రామాల్లో ప్రతి 40 మంది కూలీలకు ఒక ఎన్‌ఎంఎంఎస్ మేట్‌ను ఎంపిక చేయాలని, మేట్‌గా ఉండే వ్యక్తికి ఖచ్చితంగా ఒక ఆండ్రాయిడ్ ఫోన్, ఉపాది హామీ కార్డు ఉండి గతంలో కూలీగా పనిచేసిన వారిని మాత్రమే నియమించాలని, 50శాతం మహిళలకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సూరానాయక్, టీఏ రాజేశ్వరి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.





## నిఘా నేత్రాలను ఏర్పాటు చేసుకోవాలి

**ప్రజాపక్షం/చింతపల్లి :** గ్రామాలలో ప్రజలు నిఘా నేత్రాలను ఏర్పాటు చేసుకోవాలని దేవరకొండ డివిస్పి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని హోమంతాలపల్లి గ్రామంలో మంగళవారం గ్రామస్తులకు సిసి కెమరాల ఏర్పాటు, ఉపయోగం వాటి అవశ్యాకత గురించి డిఎస్పి అవగాహన కల్పించారు. నేరాలను నియంత్రించటానికి, వాస్తవాలను వెలిక్కి తీయటానికి సిసి కెమరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ నెల చివరివరకు సిసి కెమరాలను ఏర్పాటు చేస్తామని గ్రామస్తులు డిఎస్పికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ రామ్మూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హెల్పింగ్ హ్యాండ్స్ సాయం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామ పంచాయతీ డిఎం కుంట గ్రామానికి చెందిన రగ్బి క్రీడాకారుడు అందుగుల శివ లింగస్వామికి మంగళవారం కొండమల్లేపల్లి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ. 20వేల ఆర్థిక సాయం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో ఎదగడానికి పేద రికం అడ్డుకారాదని అన్నారు. ఈనెల 20న బీహార్‌లో జరిగే జాతీయ పోటీలలో పాల్గొనడానికి ఖర్చుల నిమిత్తం లింగస్వామికి ఈ నగదును అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఏరుకొండ రాము, కూన భానుచందర్, విప్పలపల్లి జితేందర్, ఎస్‌వి మార్బుల్స్ సైదులు, నాగార్జునరెడ్డి, రవికుమార్, మల్లిఖార్జున్, యాదగిరి పాల్గొన్నారు.

## మూల్యాంకన రేట్లు పెంచాలని నిరసన

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పదవ తరగతి మూల్యాంకన రేట్లు పెంచాలని మంగళవారం జిల్లా కేంద్రంలోని స్పాట్ వాల్యూయేషన్ సెంటర్ల వద్ద భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా రెమ్యూనరేషన్ పెంచడం లేదని, ఇంటర్ మీడియట్ వారితో సమానంగా పారితోషికం పెంచాలని, స్పాట్ ముగిసిన వెంటనే అట్టి డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రతి జవాబు పత్రానికి ఇప్పుడొస్తున్న నామమాత్రపు రెమ్యునరేషన్ రెట్టింపు చేయాలన్నారు. అనంతరం డిప్యూటి క్యాంప్ ఆఫీసర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు తంగెళ్ల జితేందర్ రెడ్డి, సోంబాబు, పబ్బతి వెంకటేశ్వర్లు, బంధం వెంకటేశ్వర్లు, జహంగీర్, సత్యనారాయణ పాల్గొన్నారు.



## సమగ్ర ఆరోగ్యం వైపు అడుగులు వేయాలి



**ప్రజాపక్షం/నూతనకల్ :** ప్రజలు సమగ్ర ఆరోగ్యం వైపు అడుగులు వేయాలని డిఎంహెచ్ఓ డాక్టర్ పెండెం వెంకటరమణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ర్యాలీలు, అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నివసించే పర్యావరణం, అతని చుట్టూ ఉండే జంతుజాలం కూడా సురక్షితంగా ఉండాలని, అడువుల నరికివేత, వన్యప్రాణుల అక్రమ రవాణా వంటి కారణాల వల్ల వైరస్‌లు తమ సహజ అవాసాలను కోల్పోయి మనుషులపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ఎబోలా, నిపా, కోవిడ్ 19, మంకీ పాక్స్ వంటి వ్యాధులు ఉదాహరణలని తెలిపారు. లంపీ స్కిన్ డిసిజ్, బర్డ్‌ఫ్లూ వంటి వ్యాధులపై ముందస్తు నిఘా బలోపేతం చేయాలని కాలుష్య నియంత్రణ చేయాలని, గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం వంటి వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలన్నారు.

## బిసి టియు జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బిసి టీచర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటిని ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లంకొండ రామ్మూర్తి గౌడ్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని భాష్యం జూనియర్ కళాశాలలో జరిగిన ఎన్నికలో జిల్లా అధ్యక్షులుగా బెల్లంకొండ సైదులు, ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల దేవరాజు, కోశాధికారిగా మండవ సైదులు, గౌరవ అధ్యక్షులుగా పోతురాజు నర్సయ్యలు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 90శాతంకు పైగా బహుజన విద్యార్థులు చదువుతున్నారని మౌళిక వసతులు కల్పించి బలోపేతం చేసేలా ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం జాప్యం చేయకుండా వెంటనే పెండింగ్ డిఏలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొన్నె శంకర్ గౌడ్, వెంకటరమణ, బి. శ్రీనివాస్, లింగాల రవి గౌడ్, మన్నూరి నాగన్న, దొంగర మహేష్, నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జయంతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



**ప్రజాపక్షం/భువనగిరి :** మహనీయుల జయంతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్‌పి అక్షాంశ్ యాదవ్ అన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాలను జయప్రదం చెయ్యాలాని కోరుతూ బైక్ స్టికర్‌ను సుపర్డెంట్ ఆఫ్ పోలీస్ ఎస్‌పి ఆకాంక్ష్ యాదవ్ ఆవిష్కరించి బైక్‌లకు స్టికర్‌ని అతికించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహనీయుల జయంతి ఉత్సవాలో భాగంగా, ఏప్రిల్ 14న భీమ్ యాత్రను సమరస్య పూర్వక వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించాలని ఇందు కోసం నిర్వహకులు మంచి కార్యచరణతో ముందుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బట్టు రామచంద్రయ్య, బర్రె జహంగీర్, బండారు రవివర్ధన్, మార్కెట్ కమిటీ చైర్మన్ కనుకుంట్ల రేఖ బాబురావు, కర్తల శ్రీనివాస్, శివలింగం, దుబ్బ రామకృష్ణ మాదిగ, ఇటుకల దేవేందర్ మాదిగ, కుతాడి సురేష్, నాగరం శంకర్, కారుపటి రాజు, కనుకుంట్ల రమేష్ కోటి, బండారు శివశంకర్, బండారు జహంగీర్, గోపే బాబు, క్యాసాగళ్ల చందు, ఎండి కరీం, గాయపక శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సులు లేక విద్యకు దూరమవుతున్న విద్యార్థులు

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట అమ్మనబోలు రూట్లో పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించి ప్రజలు, విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ఆర్టిసి అధికారులను డిమాండ్ చేశారు. నల్లగొండ రీజినల్ మేనేజర్ జానీరెడ్డికి ఆర్ఎం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా నిత్యం ఆర్టీసీ బస్సు సేవలు అందించి అనేకమందికి ప్రయాణానికి సులభంగా ఉన్న బస్సు గత రెండు సంవత్సరాల నుండి నడవకపోవడంతో విద్యార్థులు, గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దుబ్బాక, మునిపంపుల పల్లివాడ, ఎన్నారం, బాచుప్పల సూరారం, తుర్కపల్లి గ్రామాల ప్రజలు నిత్యం అనేక అవసరాలు రీత్యా రామన్నపేట మండల కేంద్రానికి వస్తుంటారు. సుమారుగా తొమ్మిది గ్రామాలకు కనీసం పల్లె వెలుగు బస్సురాకపోవడం అభివృద్ధికి తిరోగమనమని సమస్యను గుర్తించి వెంటనే రామన్నపేటఅమ్మనబోలు రూట్లో పల్లెవెలుగు బస్సును పునరుద్దరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు గంటెపాక శ్రీను, మాజీ వార్డు సభ్యులు బూడిద బిక్షం, సంజీవ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివ కుమార్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల నరేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, శ్రీకృష్ణ, నకిరేకంటి సురేష్ పాల్గొన్నారు.





## ఎస్‌సిల సంక్షేమ పథకాలు అమలు చేయాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** ఎస్‌సిల సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు పల్లెటి లక్ష్మ ణ్ మాదిగ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అభయహస్తం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి రూ.12లక్షల ఆర్థిక సహాయం తక్షణమే అందించాలని కోరారు. ఎస్‌సి కార్పోరేషన్ నిధులు కార్పోరేషన్ శాఖకు రూ.15వేల కోట్లు కేటాయించి సబ్సిడీ రుణాలు కూడా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాలు సాగు భూమిని కేటాయించాలని జిఓ నెంబర్ 58, 59 ప్రకారం పట్టాలు ఇచ్చి అమ్ముకునే హక్కు కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కనుకు జానయ్య మాదిగ, జిల్లా నాయకులు ఆకారపు వెంకన్న, కొమ్ము సోమన్న, పానుగంటి నగేష్, ఆకారపు రాములు, కొమ్ము అంజయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రచార కార్యక్రమం



**ప్రజాపక్షం/రామన్నపేట :** ప్రభుత్వ జూనియర్ కళాశాల రామన్నపేటలో అడ్మిషన్లను ప్రోత్సహించేందుకు కళాశాల ప్రిన్సిపాల్ సి.జగదీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ కళాశాల ప్రత్యేకతలను వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత ఇంటర్ విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్, స్కాలర్షిప్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదనంగా ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు ఉదయం అల్పాహారం , మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, డిజిటల్ తరగతులు, విశాలమైన ల్యాబ్ సౌకర్యాలు, గ్రంథాలయం, క్రీడా ప్రాంగణం, బస్సు సౌకర్యం వంటి సదుపాయాలు ఉన్నాయని వివరించారు. అలాగే ఈఏపీ సెట్, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు మాలే వెంకట్ రెడ్డి, రాజేశ్వరి, నరసింహారావు, అశోక్ కుమార్, ఉపేందర్ రావు, అశోక్ రెడ్డి, జీవి రావు, పున్నారావు, కిరణ్, ఉమా రాణి తదితరులు పా ల్గొని విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతం బాధ్యత

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలోని సంజీవయ్య నగర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో నేడు 'ముందస్తు బడిబాట' కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవాస ప్రాంతంలో ప్రతి ఇంటికి తిరుగుతూ తల్లిదండ్రులను కలిసి పిల్లలను పాఠశాలలో చేర్పించాల్సిందిగా అభ్యర్థించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలు కచ్చితంగా ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో చేరాలని, గ్రామ ఉపసర్పంచ్ మోటె రమేష్ ఈ సందర్భంగా తెలియజేశారు. వార్డు మెంబర్ కొమ్ము రామస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పౌష్టికాహారంతో పాటు ఉచిత యూనిఫారం, నోటు పుస్తకాలు, రాగి జావా ఇస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పెద్ద మొత్తంలో పిల్లలను పాఠశాలలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునీత, పాఠశాల ఉపాధ్యాయులు పుష్పావతి, నాగయ్య, అబ్దుల్ రహీం, కుమారస్వామి, సునీత పాల్గొన్నారు.





## ఎమ్మెల్యేకు సన్మానం

**ప్రజాపక్షం/రామన్నపేట** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నకిరేకల్ శాసన సభ్యులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, జన హృదయనేత వేముల వీరేశంను ప్రభుత్వ విప్‌గా నియమించిన సందర్భంగా ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన జిల్లా నాయకులు పూస బాలకిషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నకిరేకల్ ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రశంసించారు.

## పేదల సొంతింటి కళ ప్రజాప్రభుత్వంతోనే



**ప్రజాపక్షం/చివ్వెంల** : పేదల స్వంతింటి కళ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాకారం అవుతుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని బద్యతండ గ్రామంలో బానోతు సైదమ్మ కృష్ణల నూతన ఇందిరమ్మ ఇళ్ళను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత పాలకులు 10 సంవత్సరాల్లో ఏ ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ధరావత్ కనకమ్మ, సోమాని నాయక్, బానోతు వెంకన్న నాయక్, మాజీ సర్పంచ్ పద్మ మంగ్తియా పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**ప్రజాపక్షం/మోటకొండూర్** : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పెదబావి, చాకంపల్లి గ్రామ సర్పంచ్ వేల్పుల రజిత శ్రీరాములు అన్నారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు 370 పశువులకు టీకాలు వేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, మండల పశు వైద్యాధికారి శ్రీకాంత్ సిబ్బంది, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం )**: మండలంలోని కొరటికల్ గ్రామంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బుర్ర కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మాజీ సర్పంచ్ లు కోల సత్తయ్య గౌడ్, కొడిమాల యాదగిరి గౌడ్ పరామర్శించి వారి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ తరపున రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు నరుకుడు బిందెల సైదులు, సెక్రెటరీ జనరల్ చుంచు శ్రీనివాస్, ఎల్ఎస్ ఫౌండేషన్ చైర్మన్ లగ్గాల పురుషోత్తం గౌడ్, వార్డు సభ్యులు చిన్నం యాదగిరి పాల్గొన్నారు.



# బాధితుడి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు



**ప్రజాపక్షం/వలిగొండ** : ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా వెంటనే స్పందించి సహాయం చేయడం పోలీస్ శాఖ బాధ్యత అని మరోసారి నిరూపితమైంది. పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితిలో ఉన్న బాధితుడి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఘటన వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఎం.తుర్కపల్లి గ్రామానికి చెందిన ఉడుత నరసింహ అనే వ్యక్తిని, అదే గ్రామానికి చెందిన మర్రి చంద్రయ్య కర్రతో దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన నరసింహ స్థానిక రేణుకా దేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. హాస్పిటల్ సిబ్బంది మెడికో లీగల్ కేసు (MLC) కోసం పోలీసులకు సమాచారం అందించగా, బాధితుడు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాడు. దీంతో వలిగొండ ఎస్.ఐ యుగేందర్ ఆదేశాల మేరకు ఏఎస్ఐ జాఫర్, టెక్ టీమ్ కానిస్టేబుల్స్ అనిల్, శంకర్, మహిళ కానిస్టేబుల్ సింధు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు బాధితుడిని పరామర్శించి, అతని నుండి ఫిర్యాదును స్వీకరించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆలస్యం లేకుండా సంఘటన స్థలంలోనే ఆన్ సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కేసును BNS చట్టం ప్రకారం నమోదు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితిలో ఉన్న ప్రజలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని అధికారులు తెలిపారు.

# అంబేద్కర్ జయంతి ఉత్సవాల కరప్రతం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/దేవరకొండ:** భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డా. బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నల్గొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రంను దేవరకొండ ఎంఎల్ఏ క్యాంప్ ఆఫీస్‌లో ఎంఎల్ఏ బాలు నాయక్ ఆవిష్కరించారు. ఏప్రిల్ 14 మంగళవారం నిర్వహించనున్న జయంతి వేడుకల పోస్టర్‌ను ప్రజా ప్రతినిధులు మరియు వివిధ సామాజిక సంఘాల నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు అందరికి అందాలని, అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కైన్సిలర్ సాయిచంద్రగౌడ్, కాంగ్రెస్ డిండి మండల అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నల్గొండ జిల్లా అధ్యక్షుడు మద్దిమడుగు బిక్షపతి నేతృత్వంలో జరిగిన ఈకార్యక్రమంలో జిల్లాఉపాధ్యక్షులు యేకుల సురేష్, వెంకటయ్య, నియోజకవర్గ ఇంచార్జీ అంబేద్కర్, డిండి మండల ఇంచార్జీ అనిల్, ఎంఆర్‌పిఎస్ కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి అవసరం



**ప్రజాపక్షం/త్రిపురారం** :విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ చింతపల్లి వనిత పేర్కొన్నారు. ఆరోగ్యం బాగుంటేనే విద్యార్థులు చదువులోనూ,ఇతర కార్యకలాపాల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించగలరని ఆమె తెలిపారు.మంగళవారం కంపసాగర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పరీక్షల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి,వారి ఆరోగ్య స్థితిని పరిశీలించారు.పోషకాహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ప్రత్యేకంగా బాలికలు అనీమియా వంటి సమస్యలకు గురి కాకుండా సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు.అలాగే ప్రతి రోజూ వ్యాయామం చేయడం, శుభ్రత పాటించడం, సమయానికి ఆహారం తీసుకోవడం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ విజయలక్ష్మి,వెంకటమ్మ,పాఠశాల సిబ్బంది,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.కార్యక్రమం విజయవంతంగా కొనసాగి విద్యార్థినులకు ఉపయోగకరమైన ఆరోగ్య సూచనలు అందించబడినట్లు నిర్వాహకులు తెలిపారు.

# బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గ్రామంలోని బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ కట్టా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని రామచంద్రాపురం మల్లయగూడెం గ్రామాల్లో పొనుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జయశంకర్ సార్ బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం 21 రకాల వస్తువులతో పాటు మధ్యాహ్న భోజనం, గుడ్డు, రాగిజావతో పాటు ఉదయం అల్పాహారం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందిస్తున్నామని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొలిశెట్టి సుధీర్, దంతగాని నగేష్, నిమ్మల శ్రీను పాల్గొన్నారు.

## ప్రజా పోరాటాలకు సహకరించండి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న పోరాటాలకు విరాళాల రూపంలో సహకరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతుల సమస్యల పై కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సీపీఐ నిరంతరం ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ పోరాటాలు మరింత బలంగా కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అవసరమయిందని పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే ఉద్యమాలు విజయవంతమవుతాయని ప్రతి ఒక్కరు తమవంతు వివరాలు అందించి పోరాటాలకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి పందుల యాదగిరి, ఈద మల్లయ్య, పల్లె రాములు, గోపి, పెంటయ్య, సింగపంగ రమేష్, వీరయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## డీఆర్డీవో 'డేర్ టు డ్రీమ్ 5.0' పోటీల్లో ద్వితీయ బహుమతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'డేర్ టు డ్రీమ్ 5.0' ఇన్నోవేషన్ పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండలం, దేశ్ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సాయి శివ(ఫిజిక్స్) అద్భుత విజయాన్ని సాధించి వ్యక్తిగత పోటీ విభాగంలో ఆయన ద్వితీయ బహుమతిని గెలుచుకున్నట్లు విజ్ఞాన్ యూనివర్సిటీ యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్తులో అంతరిక్ష పరిశోధనలకు పెను సవాలుగా మారనున్న 'అంతరిక్ష వ్యర్థాల'ను లేజర్ సాంకేతికత ద్వారా ఎలా తొలగించవచ్చో వివరిస్తూ డాక్టర్ సాయి శివ సమర్పించిన పరిశోధనా ప్రతిపాదన ఈ బహుమతికి ఎంపికైందనీ చెప్పారు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా డీఆర్డీవో రూ.5 లక్షల నగదు బహుమతిని అందజేయనుందనీ వివరాలు వెల్లడించారు.

## ప్రభుత్వ పాటశాలల్లోనే మెరుగైన విద్య




**ప్రజాపక్షం/తుర్కపల్లి** : ప్రొపెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం వేలుపల్లి, గుజ్జవాణి కుంటతండా, వెంకటాపురం గ్రామాలను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో దత్తాయపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు చల్ల స్వరూపారాణి, ఉపాధ్యాయ బృందం పొన్నాల సత్తయ్య, మహేశ్వరం సుధాకర్, కుంచం నరసింహులు, ఇటికాల సౌజన్య, సిఆర్‌పి వీరస్వామి పాల్గొన్నారు.

## ఉపాధి పనిలో ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : గ్రామాల్లో ఉపాధిహామీ పనికి వెళ్లే ప్రజలు ఎండాకాలంలో ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని దత్తాయపల్లి గ్రామ సర్పంచ్ జేరిపోతుల కర్ణాకర్ కోరారు. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్నీ పునస్కరించుకొని ఉపాధి పని జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవటం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా డబ్బులు ఆలస్యంగా వస్తున్నాయని పనిచేస్తున్న వారు సర్పంచ్‌కి తెలపడంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడటం జరిగిందని తెలిపారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిట్టా కిషన్ యాదవ్, ఏఎన్ఎం భాగ్య, ఫీల్డ్ అసిస్టెంట్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.





## సన్ రైజ్ కోచింగ్ సెంటర్ ప్రారంభం

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్డు పాత కవిత కాలేజ్ భవనంలో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన సన్ రైజ్ కోచింగ్ సెంటర్‌ను ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ దేవరకొండ ప్రాంతంలోని విద్యార్థులకు మంచి సౌకర్యం కలిగిస్తున్న కోచింగ్ సెంటర్ యాజమాన్యానికి ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో నేరేడుగొమ్ము మండల కాంగ్రెస్ అధ్యక్షులు లోకసాని కృష్ణయ్య, మాజీ జెడ్పిటిసి బాలు, మాజీ ఎంపిటిసి వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## హెల్త్ క్యాంపు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వస్తాకొండూరు గ్రామంలో మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమంలో భాగంగా మండల వైద్యాధికారి డా. ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపును నిర్వహించారు. గ్రామ సర్పంచ్ లింగాల అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై హెల్త్ క్యాంపును ప్రారంభించారు. ఈ హెల్త్ క్యాంపులో భాగంగా ప్రజలకు ఉచితంగా బిపి, షుగర్, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి ఉచితంగా మందులను పంపిణి చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల పరిధిలోని జనంపల్లి గ్రామంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ వాటర్ హార్వెస్టింగ్ పాండ్ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.రాములు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ, గ్రామ సర్పంచ్ బండ సరోజ, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## గిరిజన గ్రామ అభివృద్ధికి కృషి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహాయ సహకారంతో పచ్చర్లబోడుతండా గిరిజన గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి నరసింహా అన్నారు. భువనగిరి మండలం పచ్చర్లబోడుతండా గిరిజన గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో హెచ్ఎండిఏ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులను పూర్తి చేసిన సందర్భంగా ఎమ్మెల్యేకు సర్పంచ్ బానోతు జ్యోతి నరసింహా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షులు బానోతు నరసింహా, వార్డు సభ్యులు గుగులోతు రజిత పాల్గొన్నారు.

## స్వచ్ఛత-సేవా సందేశంతో ఎస్‌పిఎఫ్ 5కే రన్



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన ‘యాక్షన్99’ కార్యక్రమం క్రమంగా ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం సాగర్ ఎస్‌పిఎఫ్ ఆధ్వర్యంలో 5 కిలోమీటర్ల పరుగు నిర్వహించడం విశేషంగా నిలిచింది.జెన్కో చీఫ్ ఇంజనీర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈపరుగు,ప్రాజెక్ట్ 420 గ్యాలరీ ప్రధాన ద్వారం వరకు సాగింది. ఎస్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డి.వి. భాస్కరరావు నేతృత్వంలో, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, ప్రతాప్ నాయుడు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా,జోన్ డిఐజి ఆర్.మాధవరావు ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యాక్షన్99 ప్రణాళికలో భాగంగా ప్రతి మంగళవారం ఒక సామాజిక కార్యక్రమాన్ని నిర్వహించాలని సంకల్పించామని తెలిపారు.ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ జెన్కో ఎస్‌పిఎఫ్ విభాగం,సాగర్ ప్రాజెక్ట్ భద్రత విభాగం,మిర్యాలగూడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కరెన్సీ చెస్ట్‌కు చెందిన సుమారు 33 మంది అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## జంతు సంరక్షణ చట్ట విరుద్ధనికి పాల్పడితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఇటీవల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వీధి కుక్కలను అమానవీయంగా హింసించడం,చంపడం జరుగుతున్నట్లు సమాచారం అందిందని ఇలాంటి చర్యలు చట్ట విరుద్ధమని,నేరానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పశు వైద్య,పశుసంవర్ధక అధికారి డాక్టర్ జి.వి.రమేష్ హెచ్చరించారు.జిల్లాలో వీధి కుక్కలను హింసించడం, చంపడం జరుగుతున్నట్లు సమాచారం రావడంతో అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. జంతు సంరక్షణ చట్టం 1960 ప్రకారం జంతువులను హింసించడం, చంపడం నేరమని తెలిపారు.ఏబిసి నియమాలు 2023 ప్రకారం కుక్కలను చంపడం లేదా తరలించడం చట్టవిరుద్ధం. వాటికి శస్త్రచికిత్స చేసి,టీకాలు వేసి తిరిగి విడిచిపెట్టాలి.అలాగే బిఎన్ఎస్ చట్టం ప్రకారం ఇలాంటి చర్యలకు జైలు శిక్ష విధించబడుతుంది.కాబట్టి ఎవరూ చట్టాన్ని అతిక్రమించవద్దని, ఇలాంటి ఘటనలు గమనిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏఎల్ఎఫ్ మెప్మా ఆధ్వర్యంలో రాయినిగూడెం, పిల్లలమర్రి, చివ్వెంల మండలం ఖాసీంపేట, కుడకుడ, బీబీగూడెం, ఆత్మకూర్(ఎస్) మండలంలోని దాసాయిగూడెం, దుబ్బతండలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్ముకొని నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం రైతుల ముంగిటే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి మద్దతు ధరను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల్గూరి ఇందిర వీరయ్య, కోడి నాగరాజు, శేఖర్ రెడ్డి, భూక్యా జ్యోతి లింగానాయక్, సూర్యాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ మరణం ఆ కుటుంబానికి తీరని లోటు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అకాల మరణం పొందిన పసునూరి శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూర్చాలని వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆకాంక్షించారు.మంగళవారం పసునూరి జయ శంకర్ కుమారుడు పసునూరి శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించడంతో పట్టణంలోని వారి నివాసంలో వారి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళ్ళు అర్పించి,ప్రగాఢ సంతాపన్ని తెలియజేశారు. ఈసందర్భంగా తెలంగాణ విజయ డేరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి. నివాళులర్పించిఅకాల మరణం పొందిన పసునూరి శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూర్చాలని వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని ఆభగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు గుత్తా సుఖేందర్,గుత్తా అమిత్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల జిల్లా అధ్యక్షులు రాచకొండ గిరి, యామ దయాకర్, హరి కృష్ణ, హన్ను తదితరులు పాల్గొన్నారు.

## అందరూ ఆరోగ్యంగా ఉంటేనే ముందడుగు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** అందరూ ఆరోగ్యంగా ఉంటేనే ప్రగతిలో ముందుకు వెళ్తామని సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్య వార్ పేర్కొన్నారు.మంగళవారం మండల న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని తాటికల్ గ్రామ శివారులోని లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఆరోగ్య దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పండ్లు బ్రెడ్డు అందజేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు



రామ్మోహన్‌రావు,ఎల్లపు రెడ్డి యాదగిరి రెడ్డి,న్యాయవాదులు బి ప్రకాష్ ,రావు నూకల మల్లేశం,వైద్యులు పాల్గొన్నారు.



## పక్క భవనాల నిర్మాణాలకు ప్రాధాన్యత

**ప్రజాపక్షం/నడిగూడెం:** ప్రభుత్వ కార్యాలయాలకు పక్క భవనాల నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న ఎస్సీ బాలుర హాస్టల్‌కు పక్క భవనము మంజూరు కావడంతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హాస్టల్ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ల సహకారంతో గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన పక్క భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, జిపివో కోటయ్య, వార్డు సభ్యులు సరస్వతి, రాము పాల్గొన్నారు.

## రాష్ట్రానికి జరిగే ప్రయోజనం శూన్యం

**ప్రజాపక్షం/గుండాల;** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన, పాలకుల వలన రాష్ట్రానికి జరిగే ప్రయోజనం శూన్యం అని సుద్దాల సర్పంచ్ గడ్డమీది మహోదయ్ అన్నారు. సుద్దాల గ్రామానికి కాళేశ్వరం నీళ్లు రావడంతో రైతాంగం సంతోషాన్ని వ్యక్తం చేస్తుందని దీనికి కారణం తెలంగాణ దార్శనికుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఈ సందర్భంగ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. దాదాపు 280 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరి నీటిని నేడు సుద్దాల గ్రామంలో చూస్తున్నామంటే అది కేసీఆర్ మేదస్సుకు నిదర్శనం అన్నారు. ఈకార్యక్రమంలో యాదయ్య, గోపయ్య, మల్లేష్, రమేష్, మహేష్, రాజు, శ్రీశైలం, వెంకటేష్, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శోభనాద్రిపురం నీర్నేముల గ్రామాల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/రామన్నపేట :** శోభనాద్రిపురం, నీర్నెముల గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పోరుయాత్రలో భాగంగా శోభనాద్రిపురం, నీర్నెముల గ్రామంలో స్థానిక సిపిఎం నాయకులతో కలిసి సమస్యలు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా శోభనాద్రిపురం గ్రామంలో వడ్డెవాగుపై వంతెన నిర్మాణం చేయకపోవడంతో వందలాది మంది రైతులకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ సర్పంచ్ బోయిని ఆనంద్, మండల కమిటీ సభ్యులు ఎండీ రషీద్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, శాఖ కార్యదర్శిలు గోగు లింగస్వామి పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని ప్రముఖ డాక్టర్ మిట్టపల్లి జనార్ధన్ సువర్ణ దంపతుల 25వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం వాసవి క్లబ్ కెసిజిఎఫ్ నల్లగొండ,వాసవి క్లబ్ స్ఫూర్తి ఆధ్వర్యంలో సూర్యకిరణ్ మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.అనంతరం మానసిక వికలాంగులకు అన్నదానం పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి,సిబ్బంది వరలక్ష్మి,సల్మా రాజు,రాజేంద్రప్రసాద్, వాసవి క్లబ్ సభ్యులు మిట్టపల్లి వాత్సవ్ సంతోషిని,మురారిశెట్టి శంకర్,నందిని పాల్గొన్నారు.



# ఆరోగ్యానికి మించిన సంపద లేదు







**ప్రజాపక్షం/హాలియా:** మనిషికి ఆరోగ్యానికి మించిన సంపద లేదని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం హాలియాలోని తులసి హాస్పిటల్ సౌజన్యంతో టూకే రన్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండటమే ప్రధానమని దానికి మించిన సంపద మరొకటి లేదని చెప్పారు. సంపద ఎంత ఉన్న మనిషికి ఆరోగ్యం లేక పోతే అంతా నిరుపేదమని ఇది ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. ప్రస్తుత కాలంలో సర్వం రసాయన ఎరువుల పిచికారితో పండిస్తున్న పంటలతో మనిషి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గుర్తు చేశారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో అందరికీ పరీక్షలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, హాలియా సీఐ సతీష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంత్,మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, కాకునూరి నారాయణ గౌడ్,కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం, మిత సమతుల ఆహారం తీసుకోవాలని గరిడేపల్లి మండల వైద్యాధికారి నరేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ సుష్మా, అశోక్, సిహెచ్‌వో నర్సింహా, హెల్త్ సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి వున్నా నాగిని మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో శుభ్రమైన పరిసరాలు, సమతుల్య ఆహారం, వ్యాయమం, మానసిక ఆరోగ్యం, తల్లి శిశు ఆరోగ్యం, అంటు వ్యాధుల నివారణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ సల్వాది శ్రీనివాస్, సూపర్‌వైజర్ ధనమ్మ, నర్సయ్య, పుష్పావతి, సునిత, రేణుక, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే లక్ష్యం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పేద ప్రజలందరికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కోడెబంటతండాలో భూక్య భిక్షం రోజా నూతన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన రెండున్నర సంవత్సరాల్లో మిర్యాలగూడ నియోజకవర్గంలో 3500 ఇండ్లను నిర్మించిన పేద కుటుంబాల సొంత ఇంటి కలను నెరవేర్చామని అన్నారు. అతి త్వరలోనే మిర్యాలగూడ పట్టణంలో కూడా 2500 ఇండ్లకు శ్రీకారం చుట్టబోతున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో పేద ప్రజల సంక్షేమాన్ని పక్కకు పెట్టి కమీషన్‌ల కోసం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిందని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేక సైదులు, కాంగ్రెస్ నాయకులు గుండు నరేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళారీలను ఆశ్రయించొద్దు

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** రైతులు మధ్య దళారీలను ఆశ్రయించకుండా ప్రభుత్వ నిర్ణయించిన మద్దతు ధరకే కొనుగోలు కేంద్రాలలో తమ ధాన్యాన్ని అమ్ముకోవాలని ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. మంగళవారం మండలంలోని మంగళపల్లి,మరూరు,నోముల,టేకుల, నెల్లిబండ,చందంపల్లి గ్రామాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి,పిఎసిఎస్ మాజీ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వర్‌రావు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసు పాదం,ఆయా గ్రామాల సర్పంచులు పొట్ట బత్తుల జయమ్మ వెంకటేశం,నోముల కృష్ణవేణి పాల్గొన్నారు.

## పాలకులు చొరవ చూపాలి

**ప్రజాపక్షం/రామన్నపేట :** గ్రామాలలో నెలకొని ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికై పాలక ప్రజాప్రతినిధులు అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెల్లెల పెంటయ్య అన్నారు. సిపిఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా నీర్నేముల గ్రామంలో మంచినీటి ట్యాంక్‌ను పరిశీలించి వారు మాట్లాడుతూ మంచినీటి ట్యాంక్‌కు మెట్లు ఏర్పాటు చేయాలని, శిధిలావస్థకు చేరిన మెట్లవల్ల శుభ్రపరచడానికి వీలు లేకుండా పోయిందని శాశ్వత పరిష్కారం దిశగా ప్రజా ప్రతినిధులు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, మాజీ ఎంపిపి నాగటి ఉపేందర్, సిపిఎం గ్రామశాఖ కార్యదర్శి నాగటి లక్ష్మణ్, నాయకులు మేడి ముకుంద, బోయిని మల్లేశం, నాగటి అంజయ్య, పొల్పాయి చంద్రశేఖర్ రెడ్డి, నాగటి రవి, ఏశబోయిన ముత్యాలు, ఆవుల యాదయ్య, పిట్టల నాగరాజు, యాకన్న రాములమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ధనకోటిని పరామర్శ



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలం వడపర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉడత ధనకోటి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ధనకోటి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి, నాయకులు శివకుమార్, జిన్న మల్లేష్, రవి, రాములు పాల్గొన్నారు.

## మేళ్లచెరువు మండల విద్యాధికారి ఫాతిమా బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మేళ్లచెరువు మండల విద్యాధికారి ఫాతిమా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వీరు ప్రస్తుతం మండల పరిధిలోని రేవూరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తోంది. ఈమె మేళ్లచెరువు తొలి మహిళ మండల విద్యాధికారి కావడం విశేషం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిఈవో అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా ఎంఈవో కార్యాలయ సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల సౌకర్యాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తానని అన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/అనంతగిరి:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బిజెపి కిసాన్‌మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి కనగాల నారాయణ అన్నారు. మండల పరిధిలోని వాయిలసింగారం గ్రామంలో మంగళవారం బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బూత్ నెంబర్ 162లో బిజెపి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలో ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు చిట్టిబాబు, దేవరశెట్టి సత్యనారాయణ, భూక్య అఖిల్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు



## అధికారులకు సన్మాన కార్యక్రమం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట ప్రత్యేక నియోజకవర్గం ఏర్పాటు చేయాలని రామన్నపేట సాధన సమితి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులకు ఈ ప్రాంతం యొక్క చరిత్రను వివరిస్తూ అధికారులుగా వారి యొక్క సహకారం ఉండాలని సన్మాన కార్యక్రమం చేశారు. నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాత నియోజకవర్గమైన రామన్నపేటను పరిగణలోకి తీసుకోవాలని నియోజకవర్గానికి కావలసిన అన్ని రకాల ఆఫీసులు ఉన్నాయి. నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో రామన్నపేట సీఐ ఎన్. వెంకటేశ్వర్లుకు, రామన్నపేట ఎస్సై డి.నాగరాజుకు రామన్నపేట చరిత్రను వివరిస్తూ వారి యొక్క సహకారం ఉండాలని వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఎర్ర రమేష్ గౌడ్, ఎస్కే చాంద్, నియోజకవర్గ సాధన సమితి నాయకులు వర్తక వ్యాపార సంఘం నాయకులు పోతరాజు శంకరయ్య, పిఆర్పిఎస్ నియోజకవర్గ అధ్యక్షులు వరికల్ గోపాల్, టిడిపి మండల అధ్యక్షులు ఎండి ఫజల్, తెలంగాణ ఉద్యమ నాయకులు రామన్నపేట మాజీ ఉపసర్పంచ్ యాదయ్య, దళిత రత్న అవార్డు గ్రహీత తెలంగాణ ఉద్యమకారులు యాదగిరి పాల్గొన్నారు.

# సర్వీస్ రోడ్లే ధాన్యం కల్లాలు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ పరిసరాల్లో వరి కోతల సీజన్ ఊపందుకోవడంతో రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు స్థలం లేక సర్వీస్ రోడ్లనే ఆశ్రయిస్తున్నారు. నకిరేకల్‌సూర్యాపేట ప్రధాన రహదారిలో ఇనుపాముల నుంచి ఉప్పలపాడు స్టేజ్ వరకు, తాటికల్ మీదుగా నల్లగొండకు వెళ్లే మార్గంలో సర్వీస్ రోడ్లు ధాన్యపు రాశులతో నిండిపోయాయి.రోడ్డుపైనే వడ్లు ఎండబెట్టడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ధాన్యం మీదుగా వాహనాలు జారిపడే ప్రమాదం ఉండటంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు భయాందోళనతో ప్రయాణిస్తున్నారు.రాత్రివేళల్లో కుప్పలు స్పష్టంగా కనిపించక ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. రైతుల పంటను కాపాడాలనే అవసరం ఒకవైపు,ప్రయాణికుల భద్రత మరోవైపు ప్రశ్నార్థకంగా మారింది.సంబంధిత అధికారులు స్పందించి ధాన్యం ఆరబెట్టేందుకు ప్రత్యామ్నాయ మైదానాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

